సాక్షి కర్నూలు

ఆదివారం । 12 । ఫిబ్రవరి । 2023



ప్రశాంతంగా 'నవోదయ' పరీక్ష

ఎమ్మిగనూరు: నవోదయ విద్యాలయంలో 9వ తరగతి ప్రవేశం కోసం శనివారం పరీక్షను ప్రశాంతంగా నిర్వహించారు. మొత్తం 1,172 మందికి గాను 692 మంది హాజరయ్యారు.



రక్తహీనత నివారణకు చర్యలు

కర్నూలు(రాజ్‌విహార్): మహిళల్లో రక్తహీనత నివారణకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందని స్త్రీ, శిశు సంక్షేమ శాఖ డైరెక్టర్ సిరి అన్నారు. కర్నూలులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు.



టీబీ డ్యాం సమాచారం

పూర్తి మట్టం	: 1,633 అడుగులు
ప్రస్తుతం	: 1,612.58
టీఎంసీల సామర్థ్యం	: 105.788
ప్రస్తుతం	: 42.919
ఇన్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 000
ఔట్‌ఫ్లో (క్యూసెక్కులు)	: 9,270

న్యూస్‌రీల్

మార్చి 21 వరకు 'స్పందన' రద్దు

కర్నూలు(సెంట్రల్): ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ అమల్లో ఉండటంతో మార్చి 21వ తేదీ వరకు స్పందన కార్యక్రమాన్ని రద్దు చేసినట్లు కలెక్టర్ పి.కోటేశ్వరరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో స్పందన కార్యక్రమం ఉండబోదని, ఈ విషయాన్ని ప్రజలు గమనించాలని సూచించారు.

మద్దతు ధరతో శనగల కొనుగోలు

- రేపటి నుంచి ఆర్‌బీకేల్లో రిజిస్ట్రేషన్లు

కర్నూలు(అగ్రికల్చర్): మద్దతు ధరతో రైతుల నుంచి శనగలను కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ జి. రాజు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనగకు ప్రకటించిన మద్దతు ధర రూ.5,335గా ఉందని, అయితే మార్కెట్‌లో ధర 4,500 వరకు మాత్రమే లభిస్తోందని పేర్కొన్నారు. రైతులు నష్టపోకుండా మద్దతు ధరతో శనగలను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుందని తెలిపారు. రైతులు సోమవారం నుంచి రైతుభరోసా కేంద్రాల్లో తమ వివరాలను రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. ఈ-క్రాప్‌లో పంటను నమోదు చేయించుకుని, ఈ-కేవైసీ చేసుకున్న రైతులు మాత్రమే మద్దతు ధరతో శనగలు అమ్ముకోవడానికి వీలుందని తెలిపారు.

త్వరలో కర్నూలులో ఈఎస్‌ఐ హాస్పిటల్



కర్నూలు ఎంపీ సంజీవకుమార్

కర్నూలు(హాస్పిటల్): త్వరలో 30 పడకల ఈఎస్‌ఐ హాస్పిటల్‌ను కర్నూలు పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఏర్పాటు చేయనున్నట్లు ఎంపీ డాక్టర్ ఎస్. సంజీవ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్మికుల కోసం ఈ ఆసుపత్రి స్థాపిస్తున్నట్లు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవ కారణంగా ఈఎస్‌ఐ హాస్పిటల్ కలను సాకారం చేసుకున్నట్లు తెలిపారు. ఇందుకు జిల్లా కలెక్టర్ ఐదు ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించారని పేర్కొన్నారు. భవిష్యత్‌లో ఈ ఆసుపత్రిని వంద పడకల హాస్పిటల్‌గా పెంచవచ్చన్నారు. ఈ ఆసుపత్రి ఏర్పాటుతో 30 వేల మంది కార్మికులు చికిత్స అందుకోవచ్చన్నారు. ప్రస్తుతం కార్మికులు తిరుపతి, హైదరాబాద్ వెళ్లి చికిత్స తీసుకుంటున్నారని, ఇకపై కర్నూలులోనే అన్ని రకాల అన్ని చికిత్సలు అందుకోవచ్చని ఆయన పేర్కొన్నారు.



వెంకటలక్ష్మి ఇల్లు

సండే స్పెషల్

అమ్మను ఒప్పించి.. ఊరును మెప్పించి!

అదో మారుమూల గ్రామం. జిల్లా కేంద్రానికి దూరంగా విసిరేసినట్లు ఉంటుంది. అక్కడో నిరుపేద కుటుంబం. కుటుంబ పెద్ద మరణించడంతో తల్లి రెక్కలుముక్కలు చేసుకుంటోంది. ముగ్గురు ఆడపిల్లల పోషణ ఆమెకు తలకుమించిన భారం. ఎలాగోలా నెట్టుకొస్తున్నా.. రెండో కూతురు లక్ష్యం ఆమెను ఆలోచనలో పడేసింది. ఎంత కష్టమైనా.. కుమార్తె ఎదుగుదలకు తోడుగా నిలవాలనుకుంది. ఉన్నంతలో డబ్బు సర్దుతూ స్వేచ్ఛనిచ్చింది. అందుకు అనుగుణంగానే ఆ యువతి ఇప్పుడు పవర్ లిఫ్టర్‌గా రాణిస్తూ.. ఒలింపిక్స్ లక్ష్యంగా సాధన చేస్తోంది.



తీసుకునే ఆహారం ఇలా..

ఉదయం: ఆరు కోడిగుడ్లు, 500 గ్రాముల రాగిజావ, మొలకెత్తిన విత్తనాలు, నాలుగు అరటి పండ్లు, డ్రైఫ్రూట్స్.
మధ్యాహ్నం: రైస్‌తో పాటు చపాతి, కర్రీ.
రాత్రి: రోటి, కర్రీ. వారానికి మూడు సార్లు చికెన్. ఒక్కోరోజు మటన్, చేప.

శిక్షణ ఇలా.. :
ఉదయం: 3 గంటలు
సాయంత్రం: 3 గంటలు

పవర్ లిఫ్టర్‌గా రాణిస్తున్న వెంకటలక్ష్మి

- పేదరికాన్ని ఎదురించి లక్ష్యం దిశగా అడుగులు
- కూలి పనులకు వెళ్తూనే చదువు పూర్తి
- రెండేళ్లుగా కర్నూలులో కఠోర శిక్షణ
- ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో పతకాలు

ఆస్పరి: వెంకటలక్ష్మి. ఈ పేరు ఆస్పరి మండలం కైరుప్పల గ్రామానికే కాదు.. జిల్లా, రాష్ట్రస్థాయిలో ఇప్పుడిప్పుడే వినిపిస్తోంది. ఇంట్లో ముగ్గురూ ఆడపిల్లలే అయినా.. చిన్నప్పటి నుంచి మగరాయుడిలా పెరుగుతూ సరికొత్త లక్ష్యాన్ని ఎంచుకుంది. పేదరికం అడుగడుగునా అవాంతరాలు సృష్టిస్తున్నా.. అందివచ్చిన అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ దూసుకెళ్తోంది. కృషి, పట్టుదల ఉంటే గమ్యం చేరుకోవడం సులువని నిరూపిస్తూ.. పురుషులకే కష్టమైన పవర్ లిఫ్టింగ్‌లో తనదైన శైలిలో రాణిస్తోంది. ఇప్పటికే జిల్లా, రాష్ట్ర స్థాయిలో తనకంటూ ఓ ప్రత్యేకతను కనపరుస్తున్న ఈమె ఒలింపిక్స్‌లో పతకం సాధనే తన జీవిత ఆశయమని చెబుతోంది. వివరాలు ఆమె మాటల్లోనే.. అమ్మ నరసమ్మ, నాన్న వీరభద్రప్ప. మేము ముగ్గురు ఆడపిల్లలం. చిన్నతనంలోనే నాన్న మరణించడంతో అమ్మ కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తోంది. అక్క, చెల్లికి పెళ్లిళ్లు చేసింది. అమ్మ కష్టం దగ్గర నుంచి చూడటంతో నేను ఆమెకు మగబిడ్డగా తోడు నిలిచేందుకు నిర్ణయించుకున్నా. చిన్నతనం నుంచి హెయిర్ కటింగ్‌తో పాటు దుస్తుల విషయంలోనూ మగపిల్లలనే అనుసరించేదాన్ని. అమ్మ కూడా నన్ను అలాగే పెంచింది. పాఠశాలకు వెళ్లినా.. కళాశాలలో అడుగుపెట్టినా ఎవరూ పోల్చుకోలేనంతగా నేను మగరాయుడిలా ఉండేదాన్ని.

కూలి పనులకు వెళ్తూనే..

కష్టం విలువ తెలియడం వల్ల అమ్మకు భారం కాకూడదని బలంగా నిశ్చయించుకున్నా. ఆలూరులో ఇంటర్మీడియట్, ఎమ్మిగనూరులో డిగ్రీ పూర్తి చేశా.. ఆదివారం, సెలవు రోజుల్లో కూలి పనులకు వెళ్లి కూడబెట్టుకున్న డబ్బుతో కాలేజీ ఫీజులు, బస్సు పాస్‌లకు లోటు లేకుండా చూసుకునేదాన్ని. పదో తరగతి చదువుతుండగా ప్రతి రోజు జిమ్‌కు వెళ్లేదాన్ని. అప్పట్లోనే మంచి లిఫ్టర్‌గా ఎదగాలని నిర్ణయించుకున్నా. అయితే ఇంట్లో పరిస్థితులు బాగోలేక ఇంటర్మీడియట్, డిగ్రీ పూర్తయ్యాక నా లక్ష్యానికి పదును పెట్టా. అమ్మను ఒప్పించి కర్నూలుకు చేరుకున్నా. రెండేళ్లుగా ఇక్కడ పవర్ లిఫ్టింగ్‌లో శిక్షణ తీసుకుంటున్నా. ఆర్థికపరంగా మొదట్లో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నా.

ఒలింపిక్స్ లక్ష్యంగా..

మొట్టమొదటి జిల్లాస్థాయి పోటీల్లో ప్రథమ స్థానం దక్కడంతో ఇంకా పైకి ఎదగాలనే కోరిక బలపడింది. కిందిస్థాయి నుంచి వచ్చినదాన్ని కావడంతో జయాపజయాలను పెద్దగా పట్టించుకోను. అయితే ముందుకు వెళ్లాలని మాత్రం నిర్ణయించుకున్నా. పవర్ లిఫ్టింగ్ ఒక్కటే కాదు, వెయిట్ లిఫ్టింగ్‌లోనూ నాకు కరణం మల్లీశ్వరి, మీరాబాయ్ చాను ఆదర్శం. పోటీల్లో రాణించి ఉద్యోగం సంపాదించి స్థిరపడాలని అనుకోలేదు. ఒలింపిక్స్‌లో దేశానికి పతకం తీసుకురావాలనేది నా కోరిక. ఉన్నత చదువులు అభ్యసించాలని ఉన్నా, ఆర్థిక స్థోమత సరిపోక పోటీలపైనే దృష్టి సారిస్తున్నా.



తల్లితో..

పెళ్లి చేసి పంపక ఎందుకివన్నీ..

ముగ్గురూ ఆడ పిల్లలే కావడం, నాన్న అకాలమరణంతో మా ఇంట్లో చీకటి అలుముకుంది. అక్కకు అతి కష్టం మీద పెళ్లి చేయగా.. నేను మగరాయుడిలా తిరగడం చూసి అమ్మకు గ్రామస్తుల నుంచి సూటిపోటి మాటలు ఎదురయ్యాయి. రెండో కూతురికి పెళ్లి చేయకుండా చిన్న పాపకు పెళ్లి చేస్తే ఎలా, దాన్ని ఎవరు చేసుకుంటారనే ప్రశ్నలతో మౌనంగా రోదించింది. ఇంటర్మీడియట్ చదువుతున్న సమయంలోనే సంబంధం చూస్తామంటే ససేమిరా అన్నా. బాగా చదువుకోవడంతో పాటు జీవితంలో స్థిరపడి అమ్మను బాగా చూసుకోవాలనే కోరిక ఉంది. అందుకే ఎవరేమన్నా పెళ్లి ప్రస్తావన తీసుకురావద్దని గట్టిగా చెప్పిన. ఆ తర్వాత ఇంక నా గురించి వదిలేసి మా చెల్లెకి కూడా పెళ్లి చేసినారు.

లక్ష్యం దిశగా ముందుకు సాగుతోంది



వెంకటలక్ష్మికి పట్టుదల చాలా ఎక్కువ. కఠోర సాధన చేస్తుంది. కష్టాలను దగ్గర నుంచి చూడటం వల్ల అనుకున్న లక్ష్యాన్ని సాధించాలనే బలమైన కోరిక ఉంది. అందువల్లే ఇప్పటి వరకు పాల్గొన్న అన్ని పోటీల్లో మంచి ఫలితాలనే సాధించింది. శిక్షణకు క్రమం తప్పకుండా హాజరవుతుంది. అంతర్జాతీయ పోటీల్లో తప్పక రాణిస్తుంది.
– యూసుఫ్ బాషా, శాప్ కోచ్, కర్నూలు



బంగారు పతకం సాధించిన వెంకటలక్ష్మి

సాధించిన ముఖ్య విజయాలు

- 2022 మే 16, 17వ తేదీలలో కర్నూలులో జరిగిన జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మొదటి స్థానం.
- 2022 జూన్ 16,17వ తేదీలలో నంద్యాలలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో మొదటి స్థానం.
- విశాఖపట్టణంలో ఈ నెల 5 నుంచి 8వ తేదీ వరకు 52 కేజీల విభాగంలో నిర్వహించిన జాతీయ స్థాయి జూనియర్ పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మొదటి స్థానం.

కష్టమంతా మర్చిపోతున్నా

మా ఆయన చనిపోయాక ముగ్గురు పిల్లల పోషణ చాలా భారమైంది. నాకు తోడుగా నిలవాలని వెంకటలక్ష్మి చిన్నప్పటి నుంచి ఎంతో ఆలోచిస్తుంది. అందుకే పెద్ద పిల్లకు, చిన్న పిల్లకు పెళ్లి చేసినా ఆ పిల్లను మగపిల్లాడిలా పెంచిన. ఎప్పటికైనా నీకు మంచి పేరు తీసుకొస్తా అనేది. ఇప్పుడు బరువు ఎత్తే పోటీల్లో ఫస్ట్ వచ్చిందని తెలిసి చానా సంతోషమైంది. అందరూ ఆ పిల్లను పొగుడుతుంటే నా కష్టమంతా మర్చిపోతున్నా. మా పాప ఇంకా పైకి రావాల.
– నరసమ్మ, తల్లి

తెలిసిన వాళ్లు డబ్బు సర్దితే..

నంద్యాలలో రాష్ట్ర స్థాయి పోటీలు నిర్వహిస్తుండగా పాల్గొనేందుకు అప్పట్లో డబ్బుకు చానా ఇబ్బందిగా ఉండింది. ఇంట్లో చెబుదామంటే అమ్మ పరిస్థితి అంతంతే. నా లక్ష్యం గట్టిదైతే ఎలాగైనా డబ్బు అందుతుందని నమ్మిన. తెలిసిన వాళ్లతో రూ.100, రూ.200 సర్దుబాటు చేసుకొని బస్సు చార్జీలతో పాటు ప్రవేశ రుసుం రూ.వెయ్యి చెల్లించా. నా కష్టం ఊరికే పోలేదు. ఆ పోటీల్లో గెలవడం ఎప్పటికీ మర్చిపోలేను. ఇంక వెనక్కి తిరిగి చూడదలుచుకోలేదు. ఇప్పుడు ఊర్లో కూడా అందరూ మెచ్చుకుంటున్నారు.
– వెంకటలక్ష్మి, పవర్ లిఫ్టర్



ఎల్లమ్మా.. దీవించమ్మా: అశేష జన సందోహం మధ్య కోసిగిలో శనివారం సాయంత్రం శ్రీ రేణుక ఎల్లమ్మ మహారథోత్సవం – కోసిగి



పాహిమాం..వీర బ్రహ్మాం: పత్తికొండ పట్టణంలో శ్రీపోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి రథోత్సవంలో భారీగా పాల్గొన్న భక్తజనం – పత్తికొండటౌన్

జాతీయ లోక్ అదాలత్‌లో 26,883 కేసుల పరిష్కారం



శ్రీశైలం ముంపు బాధితురాలికి పరిహారం చెక్కు అందజేస్తున్న న్యాయమూర్తి టి. భూపాల్‌రెడ్డి

కర్నూలు(లీగల్): జిల్లా వ్యాప్తంగా శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 26,883 కేసులు పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకటనాగ శ్రీనివాసరావు తెలిపారు. కర్నూలులో అధిక సంఖ్యలో కేసుల పరిష్కారం చేయగా, జిల్లా ఏడవ అదనపు న్యాయమూర్తి జి.భూపాల్‌రెడ్డి శ్రీశైలం ముంపు బాధితులకు అందాల్సిన నష్టపరిహారాన్ని అందజేశారు. 67 రోడ్డు ప్రమాద కేసులను పరిష్కరించి బాధితులకు నష్టపరిహారం అందేలా కేసులకు పరిష్కారం చూపారు. జిల్లా ఆరవ అదనపు న్యాయమూర్తి పాండురంగారెడ్డి, జూనియర్ సివిల్ జడ్జిలు టి.జ్యోత్స్న దేవి, కె.భార్గవి, ఎం.కళ్యాణిలు పాల్గొని ఆయా కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సి.హెచ్.వెంకట నాగ శ్రీనివాసరావు, టి.కేశవ, విశ్రాంత న్యాయమూర్తి ఆదినారాయణ, లోక్ అదాలత్ సభ్యులు మురళీ మనోహర్, నిర్మల, కుమార్ పాల్గొన్నారు.

కేసుల పరిష్కారం ఇలా..	
కర్నూలు	15,139
పత్తికొండ	1041
ఆలూరు	1049
ఆదోని	5000
ఎమ్మిగనూరు	1568
డోన్	816
బనగానపల్లె	221
కోవెలకుంట్ల	286
ఆళ్లగడ్డ	249
నంద్యాల	1242
ఆత్మకూరు	86
నందికొట్కూరు	188

ఎన్నికల నియమావళి పక్కాగా అమలు

- నోడల్ అధికారుల సమీక్షలో కలెక్టర్ పి.కోటేశ్వరరావు

కర్నూలు(సెంట్రల్): ఎన్నికల నియమావళిని పక్కాగా అమలు చేయాలని నోడల్ అధికారులను కలెక్టర్ పి.కోటేశ్వరరావు ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ, పట్టభద్ర ఎమ్మెల్సీ ఎన్నికలు, స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలపై జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డితో కలసి నోడల్ అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించామన్నారు. జిల్లాలో గ్రాడ్యుయేట్, టీచర్ ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 74 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 7వ తేదీ నాటికి జిల్లాలో గ్రాడ్యుయేట్ ఓటర్లు 61,684 మంది, ఉపాధ్యాయ ఓటర్లు 5,364 మంది ఉన్నారన్నారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం 27 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. కర్నూలు స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కర్నూలు, ఆదోని, నంద్యాల, డోన్, ఆత్మకూరు, పత్తికొండ ఆర్‌డీఓ కార్యాలయాలను పోలింగ్ కేంద్రాలుగా ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. లోకల్ అథారిటీ ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాను త్వరగా ప్రకటించాలని ఆర్‌ఓగా నియమితులైన జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డికి కలెక్టర్ సూచించారు.



మాట్లాడుతున్న కలెక్టర్ కోటేశ్వరరావు

పోలింగ్ కేంద్రాల్లో అన్ని వసతులు

పోలింగ్ కేంద్రాల్లో సర్వే సిబ్బంది సహకారంతో ఎంట్రీ, ఎగ్జిట్ మార్కింగ్ చేయించాలని కలెక్టర్ సూచించారు. కాంపౌండ్ వాల్, వెంటిలేషన్, తాగునీరు, విద్యుత్, ర్యాంపు తదితర వసతులు ఉండేలా చూడాలన్నారు. ప్రభుత్వ కార్యాలయాల నుంచి సిబ్బంది వివరాలు తెప్పించుకొని ఎన్నికల విధులను కేటాయించాలని కలెక్టరేట్ ఏఓ జి.వెంకటేష్‌ను ఆదేశించారు. స్ట్రాంగ్ రూమ్‌లు, పోలింగ్ పరికరాల డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కౌంటర్లు, పోలింగ్ మెటీరియల్ సిద్ధంచేయాలన్నారు. అనంతరం కలెక్టరేట్ సిబ్బందితో ఎన్నికల నిర్వహణపై జేసీ రామసుందర్‌రెడ్డి ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఆర్‌ఓలు/ఏఆర్‌ఓల వివరాలు..

కర్నూలు లోకల్ అథారిటీ ఎమ్మెల్సీ ఎన్నికల ఆర్‌ఓ: ఎస్.రామసుందర్‌రెడ్డి, జేసీ, కర్నూలు
ఏఆర్‌ఓలు: ఎస్వీ నాగేశ్వరరావు, డీఆర్వో, కర్నూలు, బి.పుల్లయ్య, డీఆర్వో నంద్యాల
పశ్చిమ రాయలసీమ గ్రాడ్యుయేట్, టీచర్స్ ఎమ్మెల్సీ ఆర్‌ఓ: ఎస్.నాగలక్ష్మి, కలెక్టర్, ఎన్నికల అధికారి, అనంతపురం
ఏఆర్‌ఓ: ఎస్వీ నాగేశ్వరరావు, డీఆర్వో కర్నూలు

పునఃమూల్యాంకన ఫలితాలు విడుదల

కర్నూలు సిటీ: రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో డిగ్రీ మొదటి, మూడో సెమిస్టర్ పునఃమూల్యాంకన ఫలితాలను విడుదల చేసినట్లు వర్సిటీ పరీక్షల విభాగం డీన్ విశ్వనాథరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ పరీక్షల పునఃమూల్యాంకనానికి 3,104 మంది దరఖాస్తు చేసుకోగా 489 మంది, థర్డ్ సెమిస్టర్‌కు 2,918 మంది దరఖాస్తు చేసుకోగా 364 మంది ఉత్తీర్ణులయ్యారని పేర్కొన్నారు.

ఆదోనిలో స్పిన్నింగ్ మిల్లుల ఏర్పాటుకు చర్యలు

- సీఎస్ జవహర్‌రెడ్డికి వివరించిన కలెక్టర్ కోటేశ్వరరావు



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న సీఎస్ డాక్టర్ జవహర్‌రెడ్డి



హాజరైన కలెక్టర్ కోటేశ్వరరావు, జేసీ రామసుందర్‌రెడ్డి

కర్నూలు(సెంట్రల్): ఆదోనిలో స్పిన్నింగ్, జిన్నింగ్ మిల్లులను ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి డాక్టర్ జవహర్‌రెడ్డికి కలెక్టర్ పి.కోటేశ్వరరావు వివరించారు. శనివారం సీఎస్ విజయవాడ నుంచి ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ(ఆడా)పై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్, జేసీ ఎస్.రామసుందర్‌రెడ్డి, ఇతర శాఖల అధికారులతో సమీక్షించారు. ముందుగా సీఎస్ మాట్లాడుతూ..పత్తి పండించిన రైతుకు గిట్టుబాటు ధరను కల్పించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. బీడు భూములను సాగులోకి తెస్తే ప్రజల ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించడంతోపాటు చిరుధాన్యాల సాగుకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. బనవాసి ప్రాంతంలో టమాటా ప్రాసెసింగ్ యూనిట్‌తోపాటు స్టార్ట్ అప్ తరహాలో మటన్ మార్టులను ఏర్పాటు చేయాలని సూచించారు. మంత్రాలయాన్ని పర్యాటక ప్రాంతంగా అభివృద్ధి చేస్తే స్థానికులకు ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. మైక్రో ఇరిగేషన్‌ను వృద్ధి చేయాలన్నారు.

తడకనపల్లెలో వెదురు బొంగుల స్టోరేజ్

ఆదోని రెవెన్యూ డివిజన్‌లో వలసల నివారణకు ఉపాధి హామీ పథకం ద్వారా చర్యలు తీసుకుంటున్నామని కలెక్టర్ కోటేశ్వరరావు వివరించారు. బనవాసి ప్రాంతంలో వ్యవసాయ ప్రాసెసింగ్ యూనిట్లు, ఆలూరు, పత్తికొండలో ఉల్లి, టమాటా ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటైతే ఉపాధి అవకాశాలు మెరుగవుతాయన్నారు. తడకనపల్లెలో డీఆర్‌డీఏ, డ్వామా సహకారంతో వెదురు బొంగుల స్టోరేజ్ యూనిట్లను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఆదోని ప్రాంతంలో మూడు ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేస్తే 1.60 లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. రెండు ఐటీఐ, మూడు పాలిటెక్నిక్ కళాశాలలు ఏర్పాటు చేస్తే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం ఏర్పడుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం శాఖల వారీగా ఆదోని ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీలో చేపట్టబోయే పనులకు సంబంధించి యాక్షన్ ప్లాన్‌ను తనకు నివేదించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నీతి, నిజాయతీలే గొప్పవాళ్లను చేస్తాయి

- హైకోర్టు జడ్జి ఎం.గంగారావు
- పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీహెచ్ఎస్‌లో పూర్వ విద్యార్థుల సమ్మేళనం



హైకోర్టు జడ్జి ఎం.గంగారావును సన్మానిస్తున్న క్లాస్‌మేట్స్

తుగ్గలి: నీతి, నిజాయతీలే గొప్పవాళ్లను చేస్తాయని రాష్ట్ర హైకోర్టు జడ్జి ఎం.గంగారావు అన్నారు. 1975–76 పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థుల కలయికకు శనివారం తుగ్గలి మండలం పెండేకల్లు రైల్వే జంక్షన్ జెడ్పీ ఉన్నత పాఠశాల వేదికైంది. సమ్మేళన కార్యక్రమంలో పాఠశాల పూర్వ విద్యార్థి జడ్జి గంగారావు పాల్గొన్నారు. పెండేకల్లు భాస్కరరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో జడ్జి మాట్లాడుతూ గురువులు మంచి విద్యా బుద్ధులు నేర్పడం వల్లే తాను ఈ స్థాయిలో ఉన్నానన్నారు. పెండేకల్లు రైల్వే స్టేషన్ ప్రభుత్వ హాస్టల్‌లో ఉంటూ చదువుకున్నానని.. చెట్ల కింద, కొట్టాలలో తరగతులు నిర్వహించేవారన్నారు. ఊరు చుట్టూ ఉన్న కొండ గుట్టలు, వంకలు, వాగులు తిరిగానని చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. పల్లెటూరి చదువులతో ధైర్యం, నమ్మకం కలుగుతుందని, ఎక్కడైనా బతకవచ్చన్నారు. హాస్టల్‌లో ఉన్నా ఆకలి దప్పులతో ఏనాడూ ఇబ్బంది పడలేదన్నారు. పొలాలకు వెళ్లి శనక్కాయలు, కొండగుట్టల్లో సీతాఫలాలు తినేవారమని జ్ఞాపకాలను నెమరు వేసుకున్నారు. పెద్దలు, ఉపాధ్యాయులు బావులకు తీసుకెళ్లి ఈత నేర్పారన్నారు. ప్రస్తుత కాలంలో చిన్నప్పటి నుంచి కార్పొరేట్ చదువులతో పిల్లలు తల్లిదండ్రుల ప్రేమకు దూరమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అందువల్లే కొందరు పిల్లలు వృద్ధాప్యంలో తల్లిదండ్రులను పట్టించుకోవడం లేదన్నారు. ప్రధానమంత్రి స్థాయిలో ఉన్నా శాస్త్రి ఏం కొన్నా డబ్బులు చెల్లించేవారని, అలాంటి వారిని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పేవారన్నారు. చిన్నతనంలో తాను చదువుకున్న పాఠశాల అంటే తనకెంతో ఇష్టమని, పాఠశాల అభివృద్ధికి తనవంతు సహకారం అందిస్తానన్నారు. చదువు చెప్పిన గురువులు సుంకిరెడ్డి, తిప్పన్న, హుసేన్‌లను పూర్వ విద్యార్థులతో కలిసి జడ్జి సన్మానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కంగాటి శ్రీదేవి, క్లాస్‌మేట్స్ జడ్జిని ఘనంగా సన్మానించారు. అనంతరం గత ప్రభుత్వంలో మూతపడి ఇటీవల పునఃప్రారంభమైన హాస్టల్‌ను ఆయన సందర్శించి విద్యార్థులతో ముచ్చటించారు. కార్యక్రమంలో పత్తికొండ జూనియర్ సివిల్ జడ్జి దివ్య, ఆర్డీవో మోహన్‌దాస్, తహసీల్దార్ రవి, ఎస్సీ, ఎస్టీ సెల్ డీఎస్పీ యుగంధరబాబు, సీఐ రామకృష్ణారెడ్డి, ఎంఈఓ వెంకటేశ్వర్లు, హెచ్ఎం మేఖేల్, సర్పంచ్ హరికరెడ్డి, సింగిల్‌విండో అధ్యక్షుడు గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

కుమారుడిని కొట్టాడన్న కసితో హత్య

- నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు



హత్యకేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ కేవీ మహేష్

కర్నూలు: కుమారుడు కార్తీక్‌ను కర్రతో కొట్టాడన్న కసితో వడ్డె శ్రీరామ్ (41)ను దాదెపోగు శివకృష్ణ హత్య చేసినట్లు పోలీసుల దర్యాప్తులో తేలింది. ఇందుకు శివకృష్ణ తన స్నేహితులైన బండ అరవింద్ అలియాస్ చాకలి అరవింద్, ఆకెపోగు అనిల్ సహకారం తీసుకున్నారు. నిందితులను నాల్గవ పట్టణ పోలీసులు అరెస్టు చేశారు. హత్య కేసు వివరాలను డీఎస్పీ మహేష్ శనివారం విలేకరులకు వివరించారు. సంతోష్ నగర్‌లో నివాసముంటున్న దాదెపోగు శివకృష్ణకు అదే కాలనీలో నివాసముంటున్న వడ్డె శ్రీరామ్ రూ.1,500 బకాయి ఉన్నాడు. ఈ విషయంపై జనవరి 29వ తేదీన ఇరువురూ మద్యం మత్తులో ఘర్షణ పడుతుండగా శివకృష్ణ కుమారుడు కార్తీక్ అడ్డుకోవడంతో శ్రీరామ్ కర్రతో బాదాడు. ఈ విషయాన్ని మనసులో పెట్టుకుని తన స్నేహితులైన బండ అరవింద్ అలియాస్ చాకలి అరవింద్, ఆకెపోగు అనిల్‌తో కలసి శివకృష్ణ పథకం ప్రకారం జనవరి 31వ తేదీ శ్రీరామ్‌ను తన షాపు వద్దకు పిలిపించుకుని స్పృహ కోల్పోయేటట్లు కొట్టారు. అతని కుటుంబ సభ్యులు ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించగా కోలుకోలేక మృతిచెందాడు. శ్రీరామ్ సోదరుడు శ్రీనివాసులు ఫిర్యాదు మేరకు మొదట సెక్షన్ 174 ఐపీసీ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఈలోగా నిందితులు ముగ్గురు శుక్రవారం కల్లూరు వీఆర్వో–2 సూర్యబాబు ఎదుట లొంగిపోయి చేసిన నేరాన్ని అంగీకరించారు. దీంతో వారిని కర్నూలు డీఎస్పీ కేవీ మహేష్ ఎదుట హాజరుపర్చగా సీఐ శంకరయ్యతో కలసి శనివారం మధ్యాహ్నం విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలను వెల్లడించారు. మొదట అనుమానాస్పదం కింద కేసు నమోదు చేసి దర్యాప్తులో భాగంగా హత్య కేసుగా మార్పు చేసి నిందితులను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు డీఎస్పీ వెల్లడించారు.

ఉరివేసుకొని మహిళ ఆత్మహత్య



మృతిచెందిన కురువ వైష్ణవి

గోనెగండ్ల: మండల పరిధిలోని ఎస్ లింగందిన్నె గ్రామానికి చెందిన కురువ వైష్ణవి ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. ఎస్ఐ తిమ్మారెడ్డి తెలిపిన వివరాల మేరకు.. కురువ వైష్ణవి, కురువ గోపాల్‌కు ఒక కూతురు, కుమారుడు ఉన్నారు. వీరు గ్రామంలోనే కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అయితే వైష్ణవి రెండేళ్లుగా కడుపునొప్పితో బాధపడుతోంది. కడుపు నొప్పి భరించలేక శుక్రవారం రాత్రి ఇంట్లో ఫ్యాన్‌కు ఉరివేసుకుంది. దీన్ని గమనించిన కుటుంబ సభ్యులు, స్థానికులు ఆమెను కిందకు దించి కోడుమూరు ఆస్పత్రికి తరలించగా మార్గమధ్యలో మృతిచెందినట్లు ఎస్ఐ తెలిపారు. వైష్ణవి తండ్రి ఈరన్న ఫిర్యాదు మేరకు శనివారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు చెప్పారు.

నీటి గుండంలో పడి యువకుడి మృతి



రామ సుబ్బయ్య (ఫైల్)

బేతంచెర్ల: శ్రీ మద్దిలేటిస్వామి ఆలయ నీటి గుండంలో పడి శనివారం ఓ యువకుడు మృతి చెందాడు. హెడ్ కానిస్టేబుల్ రమణ తెలిపిన వివరాల మేరకు.. ఆర్ఎస్ రంగాపురం గ్రామానికి చెందిన ఈడిగ సరస్వతమ్మ కొడుకు రామ సుబ్బయ్య మద్దిలేటి నరసింహస్వామి ఆలయంలోని టెంకాయల అంగడిలో దినసరి కూలీగా పని చేస్తున్నాడు. శనివారం తెల్లవారుజామున ఆలయ నీటి గుండం వద్దకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు జారి అందులో పడిపోయాడు. ఈత రాకపోవడంతో నీటిలో మునిగి ప్రాణాలొదిలాడు. ఉదయం స్నానాలకు వెళ్లిన భక్తులు గుర్తించి సమాచారం ఇవ్వడంతో ఈఓ పాండు రంగారెడ్డి, పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడు ఈడిగ రామ సుబ్బయ్య గౌడుగా(27) గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారమిచ్చారు. తర్వాత వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని మృత దేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బనగానపల్లె హాస్పిటల్‌కు తరలించినట్లు హెడ్ కానిస్టేబుల్ వెల్లడించారు. ఏకైక కుమారుడి మృతితో తల్లి, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

గుర్తుతెలియని వృద్ధురాలి మృతి



మృతి చెందిన వృద్ధురాలు

ఎమ్మిగనూరురూరల్: పట్టణంలోని డాక్టర్ ఈశ్వరరెడ్డి హాస్పిటల్ పక్కన శనివారం గుర్తు తెలియని ఓ వృద్ధురాలు వాంతులు చేసుకొని మృతి చెందినట్లు సాయంత్రం టౌన్ ఎస్ఐ మస్తాన్‌వలి తెలిపారు. మృతి చెందిన మహిళ వయస్సు దాదాపు 60 సంవత్సరాలు పైబడి ఉండవచ్చునని చెప్పారు. ఆచూకీ తెలిసిన వారు పట్టణ సీఐ–91211 01045, ఎస్ఐ–91211 01147 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహాన్ని ప్రభుత్వాసుపత్రిలోని పోస్టుమార్టం గదిలో ఉంచామన్నారు.

20 గ్రామాల్లో వ్యవసాయ బోర్లపై తొలగిన నిషేధం

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లాలోని 20 గ్రామాల్లో వ్యవసాయ బోర్లపై ఉన్న నిషేధం తొలగిపోయింది. ఈ మేరకు ప్రభుత్వం రాజపత్రం విడుదల చేసింది. దీంతో ఆయా గ్రామాల్లోని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. గోనెగండ్ల మండలంలోని కులుమాల, గోనెగండ్ల, పెద్దమరివీడు, కోసిగి మండలంలోని కోసిగి, పెండేకల్, ఐరన్‌గల్, సేలకోసిగి, బొంపల్లి, సజ్జలగూడెం, దేవరబెట్ట, యండపల్లి, చిర్తనకల్, ఓర్వకల్లు మండలంలోని కొమరోలు, వెల్దుర్తి మండలంలోని బుక్కాపురం, బేతంచెర్ల మండలంలోని యంబాయి, చాగలమర్రి మండలంలోని చిన్నవంగలి, చాగలమర్రి, ఆళ్లగడ్డ మండలం అహోబిలం, ప్యాపిలి మండలంలోని మాధవరం, జలదుర్గం గ్రామాల్లో వ్యవసాయ బోర్ల తవ్వకంపై ఉన్న నిషేధాన్ని ప్రభుత్వం ఎత్తి వేసింది. వర్షాలు సమృద్ధిగా కురవడంతో ఈ గ్రామాల్లో భూగర్భ జలాలు గణనీయంగా మెరుగుపడ్డాయి.